

కథ 2008

7

# రూపాయి చొక్కా

ఎస్. శ్రీదేవి

"పెళ్లికి రావాలని నాకెంతగా ఉన్నా, నాన్న ఒప్పుకోలేదురా! 'ఎందుకురా, ఇప్పుడంత డబ్బు తగలేసి? వెళ్లి ఆర్నెల్లవలేదు. ఇలాగైతే డబ్బు సంపాదించినట్టే... మిగిల్చి తెచ్చినట్టే...' అని కోప్పడ్డారు. నాకైతే మిమ్మలందర్నీ చూడాలనుందిరా బావా! నాది కాని చోట, నాకు సరిపడని తిండి తింటూ, ఎవరికో అర్థమవాలని వాళ్ల భాషలోకి నా అనుభూతులను తర్జుమా చేసుకొనే ప్రక్రియలో వాటిని చంపేసి కేవలం అనుభవాలే మిగుల్చుకొంటూ బతకడం చాలా అయిష్టంగా ఉంది..." అన్నాడు అత్తయ్య కొడుకు ఉమా.

పెద్దనాన్న కూతురు మంగ పెళ్లికి రాలేకపోతున్నందుకు వాడికి బాధ. ప్రస్తుతం అమెరికాలో వున్నాడు. ఎన్నో ప్రయత్నాలు చేసి, ఎన్నో అప్పులు చేసి అమెరికా పంపారు మామయ్య. వెళ్లటం సరదాగానే వెళ్లాడుగానీ అక్కడి కెళ్లాక బెంగ మొదలైంది. ఎప్పుడెప్పుడు తిరిగి వస్తానా అని తపన.

*

మంగ పెళ్లైపోయింది. అప్పటిదాకా మాతో ఆడి పాడి అల్లరి చేసిన మంగ ఒక్కసారి పెద్దదైపో యింది. మధుపర్కం చీర కట్టుకొని ఒక అపరిచితుడి చిటికెన వేలిని పట్టుకొని కొత్త బంధం ఏర్పర్చుకొంది. పెళ్లి హడావుడంతా అయింది. ఇంక అంపకాలు. అవతల కారు రెడీగా ఉన్నా తను ఇంకా తన గదిలోనే ఉండిపోయింది. పిలుచుకొద్దామని వెళ్లాను. పుస్తకాల అరలో ఏవో వెతుక్కుంటోంది.

"ఒక్కదానివీ ఏం చేస్తున్నావమ్మా? వాళ్లంతా నీకోసం ఎదురుచూస్తున్నారు," అన్నాను.

తను తల తిప్పింది. ముఖం ఉద్విగ్నంగా ఉంది. పెదవులు చిన్నగా అదురుతున్నాయి.

"పుట్టి పెరిగిన ఇంటినీ, పరిసరాలనీ మిమ్మల్నీ వదిలిపెట్టి ఇంకెక్కడికో వెళ్లి కొత్తవాళ్ల మధ్య ఎప్పటికీ అక్కడే ఉండిపోవాలన్న ఆలోచన నాకెందుకో భయం కలిగిస్తోందన్నయ్యా!" అంది. తన గొంతు కూడా వణుకుతోంది. అప్పటిదాకా పెళ్లి అనే నాణెం యొక్క అందమైన పార్శ్వాన్ని మాత్రమే చూసిన నేను ఇప్పుడు విషాదకరమైన రెండో పార్శ్వాన్ని చూస్తున్నాను.

"వచ్చి వెళ్తూనే ఉంటావు కదా మంగా!" అన్నాను.

"కానీ, అతిథిగానే."

నేను నిర్విణ్ణుడినయాను. కాదనలేని వాస్తవం అది. ఏవో మాటలు చెప్పి మభ్యపెట్టి తనని ఓదార్చాలనిపించలేదు. ఆ నిజాన్ని యథాతథంగా స్వీకరించే ప్రయత్నం చేశాను. బహుశ నేను ఈ గదిలోకి అడుగు పెట్టేటప్పటికి తను అదే చేస్తుండవచ్చు.

"ఏం చేస్తున్నారే లోపల?" పెద్దమ్మ వచ్చింది. "అక్కడ వాళ్లు తొందరపడుతున్నారు. ఇక్కడీ గదిలో ఏం కబుర్లు?" అంది వస్తూనే.

మంగ కళ్లల్లో నీళ్లు నిలిచాయి. "అమ్మా!" అంటూ పెద్దమ్మ భుజం మీద తలానించి ఏడ్చేసింది.

"బావుండదు మంగా! ఈ ఏడుపేమిటి అసహ్యంగా? వాళ్లేమనుకుంటారు?" తను కన్నీళ్లు తుడుచుకుంటూనే కోప్పడింది పెద్దమ్మ.

అర్థమైంది. త్యాగం కూడా నవ్వుతూనే చెయ్యాలి... ఎలాంటి పరిస్థితుల్లో చేసినా ఎంత బల

వంతం మీద చేసినా. లేకపోతే స్వీకరించడానికి అవతలి వారికి ఇబ్బందిగా వుంటుంది. అతన్ని చేసుకొని అతని వెంట వాళ్లింటికి వెళ్లటం తన అదృష్టం అన్నట్టు మంగ ఉండగలిగితేనే తన వైవాహిక జీవితం చాలా హేపీగా ఉంటుంది. కొద్దిసేపటికి సర్దుకొని మంగ అత్తవారింటికి వెళ్లిపోయింది. కారు కనుమరుగయే దాకా చూసి మేం లోపలికి వచ్చేము.

"నీ ప్రయాణం ఎప్పుడు? ఒక్కడివే వెళ్తావా? నీ భార్యని కూడా తీసుకెళ్తావా?" అడిగింది అమ్మ నన్ను.

"అవనిని కొద్దిరోజులు ఉంచకూడదూ? అందరూ ఒక్కసారి వెళ్లిపోతే ఇల్లు బోసిపోతుంది," అంది పెద్దమ్మ.

"అదా? ఇక్కడా? శివ ఆఫీసుకి వెళ్లింది మొదలు వచ్చేదాకా గేటుకే కళ్లు అతికించి ఉంచుతుంది. ఈ ప్రేమలేమిటో, ఈ విడిచిపెట్టి ఉండ లేకపోవటా లేమిటో మనప్పుడు తెలీవు," అమ్మ చెప్పింది. కానీ ఆ ఎదురుచూపుల కర్థం నాకు తెలుసు. మా పెళ్లై ఆరునెల లైంది. గేటు చిన్నగా చప్పుడైనా ఉలిక్కిపడి ఆశగా చూస్తుంది అవని, వాళ్ల నాన్నగారు వచ్చేరేమోనని. వాళ్లదీ ఈ ఊరే. ఆయన ఎప్పుడైనా వస్తే తన కళ్లు దీపాల్లా వెలుగుతాయి. ఆయన కాకుండా ఇంకెవరైనా అయితే నిరాశ. కొంతలో కొంత నన్ను చూసినా తన కళ్లలో వెలుగుంటుంది. ఆ చిరు వెలుగుని గురించే అమ్మ అంటున్నది.

అవని నాతో వస్తుందనే విషయం మా ఇద్దర్లో ఎవరం బైటికి అనకపోయినా దానంతట అదే సెటిలై పోయింది. తపస్వినీ నది మీద భారీ ప్రాజెక్టు కడు తున్నారు. దాన్ని మా కంపెనీకి కాంట్రాక్టుకిచ్చారు. ఇంతకాలం పేపరు వర్కు జరిగింది. అంచనాలు ఆమో దించబడ్డాయి. పర్యావరణ శాఖ నుంచి, అటవీశాఖ నుంచి అనుమతి వచ్చింది. అక్కడుండే యాభైవేల కోయజాతి కుటుంబాలు నిర్వాసితులౌతారు. వాళ్లకి పునరావాసం కల్పించటానికి ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. కానీ ఆ కోయలు స్థలాన్ని మాకప్పగించి వెళ్ల టానికి ప్రతిఘటిస్తున్నారు. ఈ నేపథ్యంలో మాకు ప్రాజెక్టు సైటులో క్వార్టర్సు కట్టిచ్చి ప్రాజెక్టు నిర్మాణం పని మొదలుపెట్టింది మా కంపెనీ. ఇప్పుడు నేనక్కడికి వెళ్లాలి.

సిటీకి బాగా దూరంగా అడవి లోపలెక్కడో ఉండాలి. కంపెనీ ఎన్ని సదుపాయాలు కల్పించినా దూరం దూరమే. ఆ తర్వాతి రోజే ప్రయాణం. "ఇల్లు దాటి ఎటూ వెళ్లకండి. టార్చిలైటు ఎప్పుడూ దగ్గిరుంచు కోండి. రాత్రులు బైటికి వెళ్లొద్దు. స్టాఫుతో కలిసే వెళు తున్నారు కాబట్టి ఇప్పుడు మేం రాము. వీలు చూసు కొని వస్తాం," అమ్మ జాగ్రత్తలు చెప్పింది. అవని తల్లి దండ్రులు కూడా వచ్చి వీడ్కోలు చెప్పారు.

కంపెనీ టాటాసుమో ఏర్పాటు చేసింది. దాదాపు పన్నెండు గంటల ప్రయాణం. అందులో ఐదు గంటలు అడవి లోలోపలికి. ప్రయాణం సరదాగానే అనిపిం చింది. విశాలంగా రెండు బెడ్‌రూమ్స్, హాలు, కిచెనుతో మాకిచ్చిన ఇల్లు చాలా బావుంది. చుట్టూ కనుచూపు మేరంతా ఆకాశాన్ని కప్పేస్తూ పచ్చటి చెట్లు. దూరా న్నుంచి తపస్వినీ నది గలగలలు.

కుటుంబాల మధ్య పరిచయాలు పెరగాలనీ, కొత్త వాతావరణంలో అలవాటుపడాలనీ మొదటి వారం రోజులు కంపెనీ గెస్ట్‌హౌస్‌లో లంచ్, డిన్నర్ ఏర్పాటుచేశారు. పిక్నిక్‌లా సరదాగా గడిచిపోయింది. కానీ వారంరోజులు అంతా సన్నిహితంగా గడిపేసరికి ప్రథమ పరిచయంలో కనిపించే డీసెన్సీ కనుమరుగై దాని వెనుక దాగి ఉండే అసలు వ్యక్తిత్వం బహిర్గత మవటం మొదలైంది. రావుకి గర్వం ఎక్కువ. సుందర్ భార్యకి అహంభావం ఎక్కువ. రాహుల్ అసంతృప్తి మనిషి. విక్రమ్ చాలా సెల్ఫ్ సెంటర్డ్. నా గురించీ, అవని గురించీ కూడా ఏవో అంచనాలు ఉండే ఉంటాయి. ఇలా ఒకరికొకరం అర్థమయాక దూరాలు మెయింటైన్ చెయ్యటమే మంచిదని అందరం స్వంత వంటలు మొదలుపెట్టాము.

*

పగలంతా నేను సైట్‌లో ఉంటాను. అవని ఇంట్లోనే ఉంటుంది. బలంగా నాటుకున్న మొక్కని ఒక చోటి నుంచి పీకి మరోచోట పెట్టినప్పుడు ఎలా వడిలి పోతుందో అలాంటి మార్పుకి సూచనలు తనలో కనిపిం చాయి నాకు. క్షేమంగా సర్దుకుంటుందనుకున్నాను.

బయట ప్రపంచంతో దాదాపుగా సంబంధాలు తెగిపోయాయి. సిగ్నల్స్ దొరక్క ఫోన్లు పక్కన పడ్డాయి. టీవీ పరిస్థితీ అంతే. కేబుల్ నెట్‌వర్క్ లేదు. అతి కష్టమ్మీద న్యూస్ పేపరు, కొన్ని పత్రికలు వస్తున్నాయి. అమ్మావాళ్లతో మాట్లాడాలనే తీవ్రమైన తపన మొద లైంది. రెండు కిలోమీటర్ల దూరంలో పోస్టాఫీసుంది. అక్కడికి వెళ్లి కార్డులు, కవర్లు తెచ్చుకొని వచ్చాను. అవనీ నేనూ చెరో రెండు ఉత్తరాలు రాశాము. వాటిని పోస్టు చేశాను. వాళ్ల జవాబు కోసం ఎదురుచూపులు.

''ఇలా ఎంతకాలం? ఇదేం ఉద్యోగం?'' నిరుత్సాహంగా అడిగింది అవని.

ఇక్కడా మనుషులున్నారు. విల్లమ్ములు పట్టుకొని తిరిగే కోయవాళ్లు, గంపల్లో ఏవో వేసుకుపోతుండేవాళ్లు తరుచుగా కనిపిస్తుంటారు. సరైన వస్త్రధారణ తెలీని, నాగరికత లేని మనుషులు. వాళ్లసలు మన తోటివాళ్లలా అనిపించరు.

సైట్లో తరచుగా వీళ్ల గురించిన ప్రస్తావన వస్తుంటుంది.

''చక్కగా ఇళ్లు కట్టించి, పొలాలిచ్చి బతకమంటే బతకరట ఈ మూర్ఖజనం. ఈ నేల వాళ్లదని విడిచిపెట్టి వెళ్లమని గొడవ. విల్లమ్ములు పట్టుకొని యుద్ధానికి బయల్దేరినట్టు వచ్చారట పట్టాలిచ్చేరోజు,'' సుందర్ చెప్పాడు.

''ప్రాజెక్టు పూర్తైతే కొన్ని లక్షల ఎకరాలకి నీరు దొరుకుతుంది. పంటలు పెరుగుతాయి. తిండి కొరత తగ్గుతుంది,'' అన్నాడు రావు.

''దేశం బాగుపడాలంటే ఇలాంటివాళ్లే ఆటంకం. చదువూ సంధ్యాలేని మూర్ఖ జనం. ఒంటి నిండా బట్టల్లేకుండా, చదువు సంధ్య ల్లేకుండా ఎలా ఉన్నారో చూడండి,'' నిరసనగా అన్నాడు రాహుల్.

వీళ్లందరికీ దేశం ఉన్న పళంగా అమెరికాగా మారిపోవాలని ఉంటుంది. అక్కడి డాలర్లు, అక్కడి సదుపాయాలు ప్రలోభ పెడుతుంటాయి. కానీ ఎట్ హూజ్ కాస్ట్ అనే ప్రశ్నకి వచ్చే జవాబు అంత ప్రమోదంగా ఉండదు. అమెరికా రెడ్ ఇండియన్స్‌ని ఏం చేసిందో అడగాలి. ఆస్ట్రేలియా అక్కడి ట్రైబల్స్‌ని ఎలా వేటాడి చంపిందో చెప్పమనాలి. ఇక్కడి నుంచి ఈ కోయలు తమదని నమ్ముకున్నవన్నీ వదులుకొని ఎక్కడికో వెళ్లిపోయి తమదికాని జీవనశైలిలో అయిష్టంగా బతుకుతుంటే ప్రాజెక్టు ఆయకట్టు వలన వేరేకొందరు రైతులు బాగుపడతారు. దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. నాకెక్కడో అసంతృప్తి మొదలైంది.

మా టీమ్‌లీడర్‌తో అన్నప్పుడు అతను చిన్నగా నిట్టూర్చి-

''నిజానికి ఇంతింత పెద్ద పెద్ద ప్రాజెక్టులవీ అవసరం లేదనుకుంటా. మనకి చెరువులు చాలా ఉన్నాయి. వాటిని మరమ్మత్తు చేసి, కబ్జాలు తొలగిస్తే చాలు. కానీ ఎవరు వింటారు? ప్రాజెక్టు కట్టడం ప్రభుత్వానికి అవసరం. కాంట్రాక్టు మన కంపెనీ మనుగడకి అవసరం. ఉద్యోగం మనకి అవసరం,'' అన్నాడు.

వందేళ్లేనా బతకని మనిషి తన అహం కోసం, వెయ్యేళ్లేనా నిలబడని తన సంస్కృతి కోసం ప్రకృతినీ, తోటివాళ్లనీ బాధ పెడుతున్నాడు! ఇలా అనిపించాక నాకు చేస్తున్న ఉద్యోగం మీద ఆసక్తి తగ్గిపోయింది.

*

నా దినచర్య క్రమబద్ధంగా మారింది. ఉదయాన్నే లేవటం... జాగింగుకి వెళ్లటం... వచ్చేసరికి వేడివేడిగా టిఫిను తిని తయారై సైటుకి వెళ్లటం... మళ్లీ మధ్యాహ్నం భోజనం... రాత్రి ఏ వేళకో ఇల్లు చేరటం... అవని ఇంటి మీద బెంగ పడుతోందన్న విషయాన్ని గుర్తించలేనంత బిజీ షెడ్యూలు.

ఆరోజు అలాగే... ఉదయాన్నే జాగింగుకి వెళ్లాను. చుట్టూ ఉన్న ప్రకృతి ప్రలోభ పెడుతుంటే చాలా దూరమే వెళ్లాను. దార్లో ఒకరిద్దరు కోయవాళ్లు నాకెదురు పడ్డారు. వాళ్లు నన్ను చూసి భయంభయంగా తప్పుకుని వెళ్లిపోయారు. ఇంకా కొంచెం దూరమెళ్లాక ఇంక వెనక్కి తిరుగుదామని తిరగబోతుంటే హఠాత్తుగా వచ్చి నా ఎదురుగా నిలబడ్డాడొక యువకుడు. నల్లగా పోత పోసిన ఇనుప విగ్రహంలా దృఢంగా ఉన్నాడు. చేతిలో విల్లమ్ములున్నాయి. చూపులు తీక్షణంగా ఉన్నాయి. నన్ను చూసి ఏదో అన్నాడు. అర్థమవలేదు. బాణాన్ని నా గెడ్డం కొనకి ఆనించి మళ్లీ ఏదో అన్నాడు. ఆ తర్వాత ఇంక ఆలోచించక నన్ను బొమ్మని తిప్పినట్టు తిప్పి నా షర్టు విప్పి తీసేసుకున్నాడు. నేను తెల్లబోయి చూస్తూ ఆ చర్యకి అర్థం ఏంటాని ఆలోచిస్తుంటే రూపాయిబిళ్ల నా చేతిలో పెట్టి నవ్వుకుంటూ వెళ్లి పోయాడు.

నడిచినంత దూరం మీదేమీ లేకుండా తిరిగొచ్చాను. చాలా ఇబ్బందిగా అనిపించింది. సిగ్గు, అవమానం కలిగాయి. ఎవరతను? ఎందుకలా చేశాడు? షర్టు కావాలని ఇలా చేస్తే రూపాయి ఇవ్వటమేమిటి?

''షర్టేది?'' నన్ను చూడగానే అవని అడిగిన మొదటి ప్రశ్న.

''దార్లో ఎవరో చలికి వణుకుతుంటే ఇచ్చాను,'' అబద్ధం చెప్పాను. తను నమ్మింది, అందులో నమ్మకపోవటానికి ఏమీ లేకపోవటంతో.

''అలా ఇవ్వకండి. ఇంటికి రమ్మని చెప్పండి,'' చిన్నపిల్లవాడికి చెప్పినట్టు చెప్పింది. నేను తలూపాను గానీ ఇంకా ఆ సంఘటన నా మెదడుని తినేస్తూనే వుంది.

అలాంటివే ఇంకో రెండు సంఘటనలు... సుందర్‌ని దారి కాసి అతని సెల్ లాక్కున్నారట... ఇలాగే రూపాయి చేతిలో పెట్టి. పాతికవేలు ఖరీదు చేసే

ఫారిన్ పీస్. చాలా ఫీచర్స్ ఉన్నాయి అందులో. వాడక పోతే పాడైపోతుందని రోజు ఛార్జి చేసి గేమ్స్ ఆడు తుంటాడు. ఎం.పి. 3 ప్లేయరుగానూ, కెమెరాగానూ వాడుతుంటాడు. రాహుల్ కళ్లద్దాలు పోయాయి. అతనికి టూపాయింటు ఫైవ్ బై ఫోకల్. మళ్లీ కళ్లద్దా లొచ్చేదాకా చాలా ఇబ్బందిపడ్డాడు.

*

అమ్మావాళ్ల దగ్గర్నుంచి మేం రాసిన ఉత్తరాలకి జవాబులు వచ్చాయి.

"ఈ ఉత్తరాలేమిటి? టెక్నాలజీ పెరుగుతుంటే సదుపాయాలు అందుబాటులోకి రాకుండాపోవటం హాస్యాస్పదంగా ఉంది. మీరిద్దరూ ఎలా ఉన్నారు? కొత్త వాతావరణానికి అలవాటుపడ్డారా? నీ సంగతి సరే. బైటికెళ్లి నలుగుర్లో తిరిగే మనిషివి. అవని ఎలా వుంది? తనకి కాలక్షేపం ఎలా జరుగుతోంది? వాళ్లమ్మా నాన్న గారు అదే బెంగ పడుతున్నారు. ఇక్కడ పదిమంది మధ్యన అలవాటుపడ్డ పిల్ల అక్కడ ఒంటరిగా ఎలా ఉండగలుగుతోందని. ఉద్యోగంలో పడి తనని నిర్లక్ష్యం చేయకు. జవాబు రాయటం కాదు. దగ్గర్లో వున్న సిటీకి వచ్చి ముందు ఫోన్ చేసి మాట్లాడు. వీలునిబట్టి నేనో, నాన్నో, వాళ్లవాళ్లో వస్తాం. పెళ్లిపనుల్లో తిరిగేసరికి పెద్దమ్మకి కీళ్లనొప్పులు బాగా ఎక్కువయ్యాయి. మంచం దిగలేకపోతోంది. నేను రావటం డౌటేగానీ నిన్ను చూడాలని మనసు కొట్టుకుంటోంది. మంగ బాగానే ఉన్నానని ఫోన్ చేసింది. కానీ కొంచెం దిగులు పడుతున్నట్టుగా ఉంది. తప్పదు మరి. పెళ్లన్నాక అంతే. ఫోన్ చెయ్యి... - అమ్మ."

ఆ ఉత్తరం చూశాక నాకు ప్రాణం లేచి వచ్చి నట్టైంది. ఎన్నిసార్లు చదువుకొన్నానో!

"ఎంతకాలం మనమిక్కడ ఉండాలి? విసుగ్గా అనిపిస్తోంది?" అంది అవని.

"అప్పుడే? కనీసం రెండేళ్లు," నవ్వాను.

"నావల్ల కాదు. మీకేం? సైట్లోకెళ్లిపోతారు. రోజంతా ఒక్కదాన్నే. బోర్ కొడుతోంది."

"చుట్టుపక్కల వాళ్లతో ఫ్రెండ్షిప్ చెయ్యి."

"ఒక గంటా రెండు గంటలు. అంతకు మించి గడిపేంత అనుబంధం మనకీ వాళ్లకీ ఎక్కడుంది? ఆ కాసేపైనా చీరలు, నగలే... ఎవ్వరికీ ఇంకో టేస్ట్ లేదు."

"పోనీ జాబ్ మానేసి నీ ఎదురుగా కూర్చోనా?" మళ్లీ నవ్వాను.

"జాబ్ మానేశాక కూడా ఇక్కడే ఉంటామా? చాల్లెండి తెలివి," తను నవ్వింది.

ఆ ఆదివారం మా ఆఫీసు వేను వెళ్తుంటే ఇద్దరం సిటీదాకా వెళ్లి వాళ్ల వాళ్లతోటీ మావాళ్లతోటీ మాట్లా డాము.

"ఉద్యోగం అన్నాక తప్పవురా, ఈ తిప్పలు. ఎక్కడికంటే అక్కడికి వెళ్లి  చెయ్యాలి. గవర్నమెంటు ఉద్యోగాల్లో ఉండి మేం మాత్రం చెయ్యలేదా. మూడేళ్ల కొకసారి ట్రాన్స్ఫర్ చేసేసేవారు. ఇక్కడ నాలుగైదు బ్రాంచీలుండటం వలన ఇప్పుడు కదా కాస్త నిలదొక్కు కున్నది?" అన్నారు నాన్న.

అమ్మ అవనితో మాట్లాడింది. అవని తల్లిదండ్రు లతో కూడా మాట్లాడాము. వాళ్ల నాన్నగారు వచ్చి చూసి వెళ్తానన్నారు.

*

ఇళ్ల బయట ఉండే సామాన్లు మాయమౌ తున్నాయి. బకెట్లు, చెప్పులు, ఏవీ వదలటంలేదు. వాటి స్థానంలో రూపాయిబిళ్లలుంటున్నాయి.

"ఎత్తుకెళ్తే ఎత్తుకెళ్లారు. ఈ రూపాయి బిళ్లలివ్వట మేమిటి మన దగ్గర్నుంచీ వాటిని కొనుక్కున్నట్టా? దొంగ వెధవలు... పోలీసు కంప్లైంటిస్తే సరి! తిక్క వదు ల్తుంది," సుందర్ మండిపడ్డాడు. "వాడీపాటికి నా సెల్ ఫోన్ని ఏ బాదంకాయ లాంటిదో అనుకొని పగల గొట్టేసి ఉంటాడు."

కంపెనీ సెక్యూరిటీ గార్డ్స్ షర్టు మీద షర్టు చొప్పున నాలుగు తగిలించుకుని, మెళ్లో సెల్‌ఫోన్, కళ్లద్దాలు, ఇంకా ఏవేవో వేళ్లాడేసుకుని తిరుగుతున్న ఒక యువకుడిని బలవంతంగాతీసుకొచ్చి మా ముందు నిలబెట్టారు. నా షర్టు కూడా అతని ఒంటి మీదే ఉంది. కోపంగా ఏదో అంటున్నాడు... అరుస్తున్నాడు... గుప్పెడు రూపాయి బిళ్లలు మా మీదికి విసిరికొట్టాడు. అతని మాటలు అర్థం కాకపోయినా సౌంజ్ఞల ద్వారా గ్రహించాను. డబ్బు ఎరగా చూపించి వాళ్ల భూమి లాక్కుని వాళ్లని రెచ్చగొడుతున్నామనేది అతడి భావన. డబ్బిచ్చి వాళ్ల భూమి బలవంతంగా లాక్కుంటున్నాం కాబట్టి అతడే డబ్బిచ్చి మా వస్తువులని బలవంతంగా లాక్కుంటున్నాడు.

అది ఒక నిరసన... ఒక నిస్సహాయత... ఇంత అమాయకంగా ఈ నేల మీద ఇంత మమకారాన్ని పెంచుకుని బతుకుతున్న వీళ్లని ఎక్కడికో వెళ్లిపోయి ఎలాగో ఒకలా బతకమనడం అమానవీయంగా అని పించింది నాకు. ఎంత డబ్బిచ్చినా జీవనశైలి నుంచి వలసపోయి ఎలా బతకగలరు. వీళ్లేకాదు, ఎవరేనా?

ఇది డబ్బుకీ అభివృద్ధికీ సామూహిక జీవనానికీ సంబంధించి ఇంకెన్నిటినో అనుసంధానించుకున్న విషయం.

నాకెందుకో ఆ క్షణాన అమ్మ గుర్తొచ్చింది. అమ్మమ్మ ఇంటికి వెళ్లినప్పుడు తన కళ్లలో కనిపించే అనిర్వచనీయమైన ఆనందం... ఎంత కన్నకూతుర్లా చూసుకున్నా ఆడపిల్లకి పుట్టింటి మీదే మమకారం... అనే బామ్మ దెప్పిపొడుపు గుర్తొచ్చాయి. అదే బామ్మ మేము అంతకు ముందు ఖాళీచేసి వెళ్లిన ఇంట్లో తను పాతిన మొక్కలకి ఎవరేనా నీళ్లు పోస్తున్నారా లేదాని బెంగపడటం గుర్తొచ్చింది. ఏడుస్తూ అత్తవారింటికి వెళ్లిన మంగ గుర్తొచ్చింది. దిగులుని కళ్లలో దాచుకునే అవని గుర్తొచ్చింది. ఇవన్నీ మనిషి అప్రమేయంగా పెంచుకునే మమకారాలు. అతని దగ్గర్నుంచి విలువైన వస్తువుల్ని తీసుకుని బట్టలు మాత్రం విడిచిపెట్టి బాగా బెదిరించి వదిలేశాం.

*

''విసుగేస్తోంది...'' అనే మాట అవని నుంచి చాలా తరచుగా వింటున్నాను. షాపింగ్ మాల్స్, ఫ్రెండ్సు, పార్టీలు, బంధువుల మధ్య సందడిగా ఉండే అవని ఈ నిరామయ ఏకాంతాన్ని భరించలేకపోతోంది. తనలో ఉద్రేకం కనిపిస్తోంది. మా పని వేగం పుంజుకోవటంతో నేను తనతో ఎక్కువ సమయం గడపలేకపోతున్నాను. ఒక్కొక్కరోజు పగలంతా సైటులో చేసిన పనిని సమీక్షించుకోవటానికి రాత్రి పొద్దుపోయేదాకా ఆఫీసులో ఉండిపోతున్నాను. మొత్తం పనిని చిన్నచిన్న ప్రాజెక్ట్స్‌గా విడగొట్టి మాకు ఎసైన్ చేశారు. కొంత వ్యవధిని నిర్దేశించారు. ఇచ్చిన పనిని మాకిచ్చిన టైమ్‌కి పూర్తిచేసి చూపిస్తే ఇన్‌సెంటివ్‌లుంటాయి. అందుకోసమని పోటీగా పని చేస్తున్నాము. ఇంకా ఆకర్షణీయమైనది... ప్రాజెక్టు తొందరగా పూర్తైతే ఈ అరణ్యవాసంలోంచి బయటపడొచ్చని.

*

అక్కడివాళ్లని స్థలం వదిలిపెట్టి వెళ్లమని మరోసారి దండోరా వేశారు. వాళ్లని బలవంతంగానైనా తరలించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వాళ్లు కూడా పెద్ద ఎత్తున ప్రతిఘటిస్తున్నారు. ఆఫీసుల్ని, క్వార్టర్సుని ముట్టడించారు. మమ్మల్ని కదలనివ్వకుండా బాణాలతో కాపలా కాస్తున్నారు. ప్రభుత్వం పోలీసులని దింపింది. వాతావరణం ఉద్రిక్తంగా మారింది.

టీవీలో ఈ వార్తలు విని కంగారుపడి అవని తండ్రితో కలిసి నాన్న వచ్చారు.

''ఏమిట్రా, ఈ గొడవంతా? మరేం భయం లేదుగా?'' నాన్న అడిగారు. మీడియా ప్రచారం చేసినంత భయంకరమైన పరిస్థితులు లేకపోవటంతో కాస్త తెరిపిన పడ్డారు.

''నేనిక్కడ ఉండను. పిచ్చెత్తిపోతుంది. మీతో వచ్చేస్తాను,'' తన తండ్రితో అంది అవని. నేను, నాన్న ఏమైనా అనుకుంటామేమోనని ఇబ్బందిగా చూశాడాయన. అసలే ఒంటరితనం... ఆపైన తను లేకపోతే? ఊహించలేకపోయాను.

''రెండు రోజులు నేనూ సెలవు పెడతాను. ఇద్దరం వెళ్దాం,'' అన్నాను.

''నేనిక్కడ ఉండలేనంటున్నానా?'' గట్టిగా అరిచింది అవని. తన గొంతు చాలా ఉద్రేకంగా ఉంది. కళ్లు మెరుస్తున్నాయి. పిడికిళ్లు బిగుసుకున్నాయి. పళ్లు బిగబట్టింది. అందరం తెల్లబోయి చూశాము.

''అలాగేనమ్మా! వచ్చేద్దువుగాని,'' నాన్న తనని శాంతింపజేశారు.

తన పరోక్షంలో ఆ విషయం మీద చర్చించుకున్నాము.

''అమ్మాయి ఆరోగ్యం దెబ్బ తిన్నట్టుంది. కొన్నాళ్లు తీసుకెళ్లడమే మంచిది. ఇలాంటిచోట్ల కోయ వాళ్లు మందులూ మాకులూ పెడతారంటారుగానీ, ఒంటరితనాన్ని మించిన అనారోగ్యం మనిషికి మరేదీ లేదు,'' అన్నారు నాన్న.

మరుసటిరోజు ముగ్గురూ వెళ్లిపోయారు. నేను ఒక్కడినీ మిగిలాను. ఇక్కడి వాతావరణంలో ఉద్రిక్తత ఇంకాస్త పెరిగింది. వాళ్లు బాణాలు వెయ్యడందాకా మేము గాల్లోకి కాల్పులు జరపడందాకా వచ్చాము.

అవని పదేపదే గుర్తొస్తోంది. తనది కాని ఈ స్థలంలో భిన్నమైన జీవనశైలిలో ఇమడలేకపోయిన అవని... ప్రేమలు, మమకారాల మధ్య ఎంతో సెక్యూర్‌గా ఉన్న తన సమూలమైన ఈ మార్పుకి తట్టుకోలేకపోతే... ఈ నిర్వాసితులు? ఉన్నచోటు, అలవాటైన జీవనశైలి వదులుకుని మరోలా బతకాలి. ఈ స్వేచ్ఛ, స్వతంత్రం ఉండకపోవచ్చు. లేదా, నాగరీకుల మోసంలో వీళ్లే కోల్పోవచ్చు. వీళ్లకి పరిహారం బాగానే ముడుతుండవచ్చు. కానీ దాన్ని వినియోగించుకునే నేర్పరితనం ఎక్కడిది? వీళ్ల బాగోగులు చూసేవాళ్లెవరు? వెరసి ఇక్కడ స్వతంత్రంగా బతుకుతున్న వీళ్లంతా ఏం కాబోతున్నారు? వలసకూలీలా? దేశద్రిమ్మరులా? తమనిలా చేస్తే ఈ వ్యవస్థని వీళ్లు క్షమిస్తారా?

నేను చదువుకున్న చదువు పట్లా, చేస్తున్న ఉద్యోగం పట్లా నాకు గొప్ప విరక్తి కలిగింది. మనిషి మనిషిలా తనకి నచ్చినట్టు బతకడానికి అవకాశంలేని దీన్ని నాగరికతని ఎలా అనుకోను?

సిటీ వెళ్లి నాన్నతో మాట్లాడాను. "అవని ఎలా ఉంది?" ఆతృతగా అడిగాను ముందు.

"ఇంకా అలాగే ఉంది. సైకియాట్రిస్టుకి చూపించాను. హిస్టీరియా అన్నాడు. మందులు వాడితే తగ్గుతుందన్నాడు. అయినా ఇంతదాకా వచ్చేదాకా ఎలా ఊరుకున్నావు?" నాన్న కోప్పడ్డారు.

"ఎక్కడ నాన్నా? నాకు రోజంతా పనే," గిల్టీగా అనిపించింది.

"అడవిలో కాబట్టి తట్టుకోలేకపోయింది. అదే అమెరికాలోనైతే హేపీగా ఉండేదనుకుంటా. ఏమిటో... ఈ కాలం పిల్లలు..." తన గొంతులో నిరసన. అమెరికాలో కూడా ఇంటి మీద బెంగ ఉంటుంది... ఉమాకి ఉన్నట్టు. కానీ తప్పనిసరిగా భరించటం.

"అక్కడి గొడవలెలా ఉన్నాయి?" నాన్న అడిగారు.

"అలాగే ఉన్నాయి. వాళ్లకిది జీవన్మరణ సమస్య కాబట్టి బాగానే పోరాడుతున్నారు. మా పని సాగనివ్వటం లేదు. పగలు కట్టినవి రాత్రి కూలగొట్టేస్తున్నారు. వాళ్లకి బైటి నుంచి కూడా మద్దతుంది."

ఇద్దరి మధ్య కొద్దిసేపు మౌనం.

"నాకెందుకో ఈ ఉద్యోగం నచ్చటం లేదు నాన్నా! వీళ్లని బలవంతంగా ఇక్కడి నుంచి వెళ్లగొట్టి ఇక్కడొక ప్రాజెక్టు కట్టి ఇంకెవరికో లాభం చేకూర్చడాన్ని నేను సమర్థించలేకపోతున్నాను. మరొకరి ఇష్టానికి వ్యతిరేకంగా వాళ్ల వ్యక్తిగత, సామాజిక జీవితాల్లోకి చొచ్చుకుపోయి వాళ్లని వెళ్లగొట్టడం నాకు బాధని కలిగిస్తోంది," అన్నాను.

"ఇందులో అనే కాదు, ఏ ఉద్యోగంలోనూ ఆత్మసంతృప్తి ఉండదు. డబ్బు కోసం... భుక్తికోసం నేనీ పని చేస్తున్నాను. ఇలా చెయ్యడం తప్ప మరో మార్గం లేదు అని ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒకచోట అనిపిస్తూనే ఉంటుంది. మనం స్వాతంత్ర్యాన్ని ఎప్పుడు కోల్పోయామో తెలీదుగాని కోల్పోయామని మాత్రం తెలుసు," అన్నారు నాన్న.

"నేనీ జాబ్ వదిలేసి వేరేది చూసుకకుందామనుకుంటున్నాను," నా అభిప్రాయాన్ని చెప్పాను.

"నీది సివిల్. అంత తేలిగ్గా ఇంకోచోట ఇంత జీతంతో ఇంకో ఉద్యోగం వస్తుందనుకోను. రిమోట్ ఏరియాలో ఉంటున్నందుకు రెట్టింపు జీతం ఇస్తున్నారు. నీ చదువుకి చాలా ఖర్చైంది. ఉషకి, లక్ష్మికి పెళ్లిళ్లు చేసినందుకు అప్పులు అయ్యాయి. అవి తీర్చాలి. మంగ పెళ్లికి కూడా కొంత సర్దవలసి వచ్చింది. ఇప్పుడు అవని వైద్యానికీ మందులకీ బాగానే ఖర్చవుతోంది. పెట్టాలి కూడా. లేకపోతే మీ మామగారి ముందు పరువుపోతుంది. రేపు నీకు పిల్లలు కలుగుతారు. నిలకడగా ఉండి నాలుగు డబ్బులు సంపాదించుకోవాలి గానీ చేస్తున్న ఉద్యోగం వదిలేసి ఏం సాధిస్తావు? కొత్తగా దొరికే ఉద్యోగం మాత్రం ఈ కార్పొరేట్ కల్చర్లో నీకు నచ్చినట్టుంటుందా?" తన గొంతు మెత్తగా ఉన్నా అందులో వాస్తవాన్ని తెలియజేస్తున్న కాఠిన్యం ఉంది. "నిర్ణయాధికారం మన చేతుల్లో లేదు. ఎవరికో అనుకూలంగా ఉండే నిర్ణయాలు ఎక్కడి నుంచో వెలువడతాయి. అవి మనమీద రుద్దబడతాయి. ఆమోదిస్తూనో తిరస్కరిస్తోనోనైనా నువ్వు వాటిని పాటించక తప్పదు కాబట్టి, బతకాలి కాబట్టి..." ఫోన్ పెట్టేశారు.

అవని ఇంక ఇక్కడికి రాకపోవచ్చు. ఇద్దరం చెరో చోటా ఉంటూనైనా సంపాదించవలసిన అవసరం. ఉమా అక్కడ, వాడి భార్య పుట్టింట్లో. అమ్మానాన్నా ఎప్పుడూ విడివిడిగాలేరు. ఎప్పుడు మొదలైందిలా? నా చుట్టూ ఏదో బిగుసుకుంటున్నట్టుగా అనిపించింది. అది రూపాయి. అందులో నేను ఇరుక్కుపోయాను. దాన్ని విప్పలేను. అందులో ఉండలేను. నన్నేకాదు, అవని... ఉమా... వాడి భార్య... అందర్నీ చుట్టేస్తోందది... ఎక్కడో మారుమూల అడవుల్లో బతుకుతున్న వాళ్ల దగ్గర్నుంచీ రూల్ మేకర్సు కాని రూల్‌బ్రేకర్స్ కానీ కాలేని నాలాంటి సామాన్యుల దాకా.

*భూమిక మాసపత్రిక, ఏప్రిల్ 2008*

